జెఎన్‌టియు ఫార్మాడీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన ఫార్మాడీ, ఎంసీఏ, ఎంబీఏ ఫలితాలు విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షలు విభాగం డైరెక్టర్ ఆచార్య ఇ.కేశవరెడ్డి బుధవారం తెలిపారు. ఫార్మాడీ నాలుగవ, ఐదవ సంవత్సరం (ఆర్17) రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు, ఫార్మాడీ ఐదవ సంవత్సరం (ఆర్14) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంబీఏ రెండవ సెమిస్టర్, నాలుగవ సెమిస్టర్ (ఆర్17) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంబీఏ రెండవ సెమిస్టర్ (ఆర్21) సప్లిమెంటరీ ఫలితాలు, ఎంఎస్‌సి మూడవ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్ ఫలితాలు, ఎంసీఏ మూడవ సెమిస్టర్ (ఆర్21) రెగ్యులర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎక్సామినేషన్ ఆచార్య బి.చంద్ర మోహన్ రెడ్డి తెలిపారు. పరీక్షా ఫలితాల కోసం http://jntuaresults.ac.in వెబ్‌సైట్‌ను ను సంప్రదించాలని తెలిపారు.

'ఉక్కు' ఉద్యమం..!

ఉధృతంగా

- జిల్లా వ్యాప్తంగా వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసనలు
- హిందూపురంలో భారీ నిరసన ర్యాలీ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై నాయకుల ఆగ్రహం

విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరించడాన్ని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా నిరసనాగ్రహం వ్యక్తం అయ్యింది. బుధవారం నాడు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో సిపిఎం, సిఐటియు, వ్యకాసం, రైతు తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ప్రయివేటీకరణ చేస్తున్న కేంద్రం, దానిని అడ్డుకోకుండా మౌనంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆందోళనలు చేపట్టారు. ఈ ఆందోళనలను పోలీసులు బలవంతంగా అణచివేసేందుకు ప్రయత్నించారు. మంగళవారం రాత్రి నుంచి ఎక్కడికక్కడ వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులను గృహ నిర్బంధం చేశారు. ప్రభుత్వం పోలీసుల చేత నిరసనలను భగ్నం చేయించే కుట్ర చేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు

హిందూపురం ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

విశాఖ ఉక్కుపై కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయం విరమించుకునే వరకు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరిస్తూ బుధవారం నాడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు రాస్తారోకో కార్యక్రమానికి పిలుపును ఇచ్చాయి. ఇందులో భాగంగా సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో వందలాది మంది కార్మికులు పట్టణంలోని ఇందిరా పార్కు నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలంతా వ్యతిరేకిస్తున్నా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్ముతామని అహంకారంతో ముందుకు వెళ్తోందన్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని ఏ ఒక్క అంశాన్ని బిజెపి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. కార్మిక చట్టాలను నీరుగార్చి లేబర్ కోడ్లుగా మార్చిందన్నారు. ఇప్పటి వరకు ఒక్క శాతం వాటా కూడా విశాఖ స్టీల్ వాటాలు అమ్మడం చేతగాని ప్రభుత్వం ఒకేసారి వందశాతం వాటాలు అమ్మాలని కుట్ర చేస్తోందన్నారు. 'పోస్కో'తో జాయింట్ వెంచర్ పక్కనపెట్టి వ్యూహాత్మక అమ్మకాన్ని కేంద్రం ముందుకు తెచ్చిందన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని ప్రజలందరూ గొంతుకలుపుతున్నారని చెప్పారు. నిరంకుశ పాలన సాగిస్తున్న బిజెపికి వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప, అధ్యక్షులు జగదీష్, కోశాధికారి రామకష్ణ, మంజునాథ, ఆనంద్, చంద్ర, నరసింహమూర్తి, శంకర పాల్గొన్నారు.

రాజకీయ ఐక్య వేదిక ఆధ్వర్యంలో...

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రాజకీయ ఐక్య వేదిక ఆధ్వర్యంలో వామపక్షాలు, కాంగ్రెస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన, రాస్తారో నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో నాడు విశాఖ ఉక్కు కోసం పోరాటం చేసి సాధించుకున్న స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం ఎంతటి ఉద్యమానికి అయిన సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్యామ్‌కిరణ్, బీఎస్పీ శ్రీరాములు, ఆర్‌సిపి శ్రీనివాసులు, ఎంఐఎం మున్నా, ఎంఎస్ఎఫ్ రవి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు హరిత, హిందూపురం మండల కాంగ్రెస్ ప్రెసిడెంట్ హనుమంత రాయప్ప, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అంజి, కలీమ్, సైపు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో నాయకులు అమానుల్లా, యూనూస్, జమీల్, రామాంజి నేయులు, అక్రమ్, గంగాధర్, ఆయాజ్, ముబారక్, గౌస్ పాల్గొన్నారు.

గృహనిర్మాణాలపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి పురోగతి చూపించాలని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి గృహ నిర్మాణం స్పందన, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, టి ఎస్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఓ కొండయ్య, ఆర్డీవోలు, గృహ నిర్మాణ శాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 32 మండలాలకు సంబంధించి ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని జెసికి సూచించారు. మండలాన్ని మూడు జోన్లుగా విభజించి, లేఅవుట్ల లబ్ధిదారుల వారిగా తహశీల్దార్, ఎంపిడిఒ, హౌసింగ్ ఎఇలు పర్యవేక్షిస్తూ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. వచ్చే రెండు నెలల్లో పురోగతి కనిపించాలన్నారు. ఇకపై శుక్ర, శనివారాల్లో డివిజన్ వారిగా గృహ నిర్మాణం పై సమీక్ష ఉంటుందన్నారు. స్పందనకు సంబంధించి 11 పెండింగ్ ఉన్నాయని గడువులోగా సంబంధిత శాఖ అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. రీ సర్వే కి సంబంధించి ఎంపిక చేసిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ త్వరగతిన పూర్తి చేయాలన్నారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి చిన్నారుల ఆధార్ అప్ డేట్ పూర్తి చేయాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో మంజూరు అయిన పనులు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు భాగ్యరేఖ, తిప్పే నాయక్, రాఘవేంద్ర, వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డిఎంహెచ్ఓ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో దద్దరిల్లిన మండలమీట్

ప్రజాశక్తి - కొత్తచెరువు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్యసమావేశం సమస్యలతో దద్దరిల్లింది. ఎంపిపి గాయిత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు సభ్యులు తమ గ్రామాల పరిధిలోని సమస్యలను ఏకరువు పెట్టారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచులు నరేందర్ రెడ్డి, అలివేలమ్మ, ఎంపీటీసీ రఫీ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల కొరతతో సమస్య ఎదురవుతోందని త్వరలో పరిష్కరిస్తామని ట్రాన్స్‌కో ఎఇ వెంకటేష్ నాయక్ సమాధానమిచ్చారు. ఐకెపి కార్యాలయంలో యానిమేటర్లు, సిబ్బంది కలిసి రూ. 30 లక్షల వరకు అవినీతికి పాల్పడ్డారని ఆ సొమ్ముని రికవరీ చేయాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు.ఇలా పలువురు సభ్యులు వారివారి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయా శాఖల అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో పోలప్ప, ఇన్‌ఛార్జి తహశీల్దార్ వెంకటరెడ్డి, ఎపిఎం నాగేంద్ర, ఎఒ నటరాజుతో పాటు ఆయా శాఖల అధికారులు, జెడ్పీటీసీ గంగాదేవి, వైస్ ఎంపీపీలు సరళ గంగరాజు, సర్పంచులు కేశవరెడ్డి, ప్రకాష్, గీతాబాయి, హరిత తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న జెసి టిఎస్ చేతన్

జాతీయ రహదారులకు భూసేకరణ వేగవంతం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో వివిధ రహదారులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియ త్వరగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో భూ సేకరణకు సంబంధించి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే 342, 716 జి, కదిరి బైపాస్, కౌలేపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి లకు సంబంధించి భూ సేకరణ వేగవంతం చేయాలన్నారు. సకాలంలో భూ సేకరణ పూర్తి అయితే రహదారుల నిర్మాణాలు పూర్తి అవుతాయని దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. భూ సేకరణలో నెలకొన్న సమస్యలను ఆర్డీవోలు పరిష్కరించాలన్నారు. ఏవైనా సమస్య వస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో పుట్టపర్తి, కదిరి, ఆర్డీవోలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, కలెక్టరేట్ జి సెక్షన్ సూపరింటెండెంట్ బాలాజీ, నేషనల్ హైవే ఇఇ మధుసూదన్, డిఇ గిడ్డయ్య, ఆయా మండలాల తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని పరిగి, కొడిగెనహళ్లి గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పరిగి కొడిగేనహళ్లి పంచాయతీ కార్యాలయం ఆయా కార్యదర్శులకు కార్మికుల సమస్యలతో కూడిన వినతులను కార్మికులతో కలిసి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు లింగారెడ్డి, నాగరాజు మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. మూడు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న వేతన పెంపు జీవోను అమలు జరపాలని, గుర్తింపు కార్డు ఇచ్చి ఈఎస్ఐ,పిఎఫ్ సౌకర్యం వెంటనే అమలు చేయాలని కోరారు. పరిగి మండలంలో ఉన్న స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ లో ఉన్న 9 నెలల వేతనాలు 15 రోజుల్లోగా చెల్లించాలన్నారు. మండలంలో ఉన్న పంచాయతీ కార్మికులు, స్వచ్ఛభారత్ కార్మికులతో కలిసి సమస్యలు పరిష్కరించడానికి 15 రోజులు వేచి చూస్తామని అప్పటికి సమస్యలు పరిష్కరించకపోతే సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని గ్రామపంచాయతీ వర్కర్ జిల్లా అధ్యక్షులు సి సజ్జరాయప్ప హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్లు, స్వచ్ఛభారత్ కార్మికులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

కనగానపల్లి మండలంలో వైసీపీకి షాక్

పార్టీలోకి చేరిన వారితో పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి - కనగానపల్లి

ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాప్తాడు నియోజకవర్గంలో వైసీపీకి దెబ్బ మీద దెబ్బ పడుతోంది. వరుసగా వైసిపికి చెందిన నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. తాజాగా కనగానపల్లి మండలంలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. కనగానపల్లి మండలం తగరకుంట, కొత్తూరు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. రామగిరి మండలం వెంకటాపురం గ్రామంలోని పరిటాల స్వగృహంలో కనగానపల్లి మండల నాయకుల సమక్షంలో వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. పరిటాల శ్రీరామ్ వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో బసినేపల్లి కష్టారెడ్డి, బసినేపల్లి శరత్ కుమార్ రెడ్డి, బసినేపల్లి ఓబిరెడ్డి, వడ్డే ముత్యాలు (వైయస్సార్ వార్డు మెంబర్) బోయ ఆంజనేయులు, దాసరి వెంకట్రాముడు, వెట్టి పెద్దన్న, కొత్తూరు సుబ్బిరెడ్డి ఇతర ముఖ్య నాయకులు ఉన్నారు. గత కొన్ని రోజులుగా వైసిపి విధానాలు అలాగే స్థానిక నాయకుల వ్యవహార తీరు నచ్చకనే తెలుగుదేశం పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. తెలుగుదేశం పార్టీతోనే రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని తాము బలంగా నమ్ముతున్నట్లు చెప్పారు. ఇకనుంచి తాము పరిటాల సునీత నాయకత్వంలో నడుస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ పార్టీలోకి కొత్తగా వచ్చామన్న భావన లేకుండా అందరితోనూ కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం అందరి టార్గెట్ తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావడమేనని రాప్తాడులో టిడిపి విజయాన్ని ఎవరు ఆపలేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కనగానపల్లి మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ యాతం పోతలయ్య, రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేశులు, రామగిరి మాజీ జెడ్పీటీసీ రామమూర్తి నాయడు, తగరకుంట పంచాయతీ సర్పంచి మాధవరాజు, తగరకుంట రామాంజనేయులు, క్లస్టర్ ఇంచార్జ్ పూజారి కృష్ణ, రాజ్ కుమార్, పెదయ్య, పాతపాళ్యం మాజీ సర్పంచి నారాయణ, గోపాల్ నాయక్, బొమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పలువురు టిడిపిలో చేరిక

నిర్వాసితులకు పరిహారం అందించండి

ప్రజాశక్తి - బుక్కపట్నం

జగనన్న లేఅవుట్ నిర్మాణానికి భూమి ఇచ్చిన రైతులకు నష్టపరిహారం అదేవిధంగా చర్యలు చేపట్టాలని ఎంపిపి శ్రీధర్‌రెడ్డి కోరారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ఏపీ స్టేట్ హౌసింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ అజయ్ జైన్‌ను బుధవారం కలిసిన ఎంపీపీ శ్రీధర్ రెడ్డి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల పరిధిలోని గసగవారి పల్లె, చింతలయ్య గారి పల్లె గ్రామాలలో ఎస్సీ కాలనీ వాసుల కోసం జగనన్న నిర్మాణానికి భూమి ఇచ్చిన రైతులకు నష్టపరిహారం త్వరగా మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా మండల పరిధిలో పిఎఫ్ఎంఎస్ ద్వారా ఇల్లు కట్టుకున్న లబ్ధిదారులకు ఐడి సమస్య వల్ల బిల్లులు మంజూరు కాలేదని వాటిని కూడా పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీలత గోవర్ధన్ రెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

టిడిపి నాయకులకు మున్సిపల్ చైర్‌పర్సన్ సెల్ఫీ ఛాలెంజ్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ అభివృద్ధిపై మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ టిడిపి నాయకులకు బుధవారం సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు గత ప్రభుత్వ వైఫల్యం, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఎన్నో సంవత్సరాలుగా పట్టణ నడిబొడ్డులో ఉన్న డంపింగ్ యార్డ్ తరలించ లేదన్నారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు డంపింగ్ యార్డ్ నుంచి దుర్వాసనతో తరచు అనారోగ్యం బారిన పడేవారన్నారు. రూరల్ మండలం పెద్దగుడ్డంపల్లి వద్దకు గతంలోనే మార్చాల్సి ఉన్నప్పటికి నాయకులు, పాలకులు తగిన చర్యలు చేపట్టలేదన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యేగా బాలకృష్ణకు ముఖ్యమంత్రి స్థాయి హోదా ఉన్నప్పటికి ఆయన వల్ల కాలేదన్నారు. ఇలాంటి సమస్యను స్థానిక ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ సహకారంతో సమస్యను మంత్రికి, ముఖ్యమంత్రికి వివరించి పరిష్కరించామన్నారు. ఈ ప్రాంత ప్రజలు టిడిపిని ఆదరించినా వారు చేసిన అభివృద్ధి ఏమీ లేదని అన్నారు. మోత్కుపల్లి, ఆహ్మద్ నగర్ ప్రాంత ప్రజలు డంపింగ్ యార్డు వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పిన వెంటనే తాము పరిష్కరించి, ఎన్నో సంవత్సరాల సమస్యను పరిష్కారం చూపామన్నారు. అభివృద్ధి, సంక్షేమం ప్రజాస్వామ్యానికి రెండు కళ్లు అనిఅందుకు అనుగుణంగానే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆశీస్సులతో, ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ సహకారంతో హిందూపురం పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు

సెల్ఫీ చాలెంజ్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

పిహెచ్‌సి భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తలుపుల

మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని కదిరి శాసనసభ్యులు డాక్టర్ పివి సిద్ధారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 1.88 కోట్ల రూపాయలతో అద్భుతమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించుకున్నామన్నారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తనకు అవినాభావ సంబంధం ఉందన్నారు. ఇదే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తాను జన్మించానని, ప్రస్తుతం ఇదే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తన చేతుల మీదుగా ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దీంతో పాటు నంబులపూలకుంట మండల కేంద్రంలో ఆధునికమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించుకుంటున్నామని మరో నెల రోజుల లోపు దానిని కూడా ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన : మండలంలోని గంజివారిపల్లి నుండి వేపమానిపేటకు నిర్మిస్తున్న రోడ్డు పనులను కదిరి శాసనసభ్యులు డాక్టర్ పి వి సిద్ధారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేపమానిపేట పంచాయతీ పరిధిలో గల గంజివారిపల్లి, బోయపల్లి, కొత్తపూలవాండ్లపల్లి గ్రామాల ప్రజల సౌకర్యార్థ ఉపాధి హామీ పథకం కింద రహదారి నిర్మాణాన్ని చేపట్టామన్నారు.

ఆసుపత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపే వరకూ పోరాటం

ధర్మవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పుట్టపర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ధర్మవరం టౌన్ : విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను ఆపాలన్న డిమాండ్‌తో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక కళాజ్యోతి సర్కిల్లో డాక్టర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. సిపిఎం నాయకులు పోలా రామాంజినేయులు, జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్.బాషా, ఆయూబ్ ఖాన్, ఎల్.ఆదినారాయణ తదితరుల ఆధ్వర్యంలో సిపిఎం కార్యాలయం నుంచి కళాజ్యోతి సర్కిల్ మీదుగా అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకులు, ఎయిర్‌పోర్ట్‌లు, నౌకలు, రైల్వే, బిఎస్ఎన్ఎల్ తదితర వాటిని ప్రయివేటీకరణ చేశారన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీ కరణపై రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా అధికార ప్రతిపక్షపార్టీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నామాలనాగార్జున, నాయకులు రఫీ, వెంకటస్వామి, హరి, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : విశాఖఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయాలని కేంద్రం చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఉద్యమం చేస్తుంటే పోలీసుల చేత అరెస్టు చేయించడం దుర్మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చలపతి, కార్యదర్శులు గంగులప్ప, రమణ, అంజినప్ప, నారాయణ, నరసింహనాయక్, కళావతి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ పోరాడి సాధించుకోన్న పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందని ఆ ప్రతిపాదనను విరమించుకోవాలని సిపిఐ, ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గణేష్ సర్కిల్లో రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రధాని మోడీ కార్పొరేట్ శక్తులకు దేశాన్ని అప్పగించాలని చూస్తున్నారని విమర్శించారు. 20వేల మంది కార్మికుల కడుపు కొట్టడానికి బడా బాబులకు కట్టబెట్టడానికి పూనుకొన్నారన్నారు. పోరాటాలు చేసి సాధించుకోన్న పరిశ్రమను అప్పనంగా అప్పగించే ప్రతిపాదనను విరమించుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు గౌస్ లాజాం, వెంకటరమణ, మహిళా సంఘం నాయకురాళ్లు జయలక్ష్మి, ఈశ్వరమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడు ఆత్మహత్యాయత్నం

సోమందేపల్లి : సోమందేపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో పనిచేసే పంచాయతీ కార్మికుడు మంగళవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మేజర్ పంచాయతీలో డ్రైవర్ గా పనిచేస్తున్న నాగరాజు ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల నేపథ్యంలో వారి నివసిస్తున్న గృహంలోనే ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషమ పరిస్థితుల్లో ఉన్న అతనిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

నిఘానీడలో సరిహద్దు ప్రాంతాలు

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్య సాయి జిల్లాకి సరిహద్దు రాష్ట్రమైన కర్నాటకలో త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జిల్లా పరిధిలోని కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలో పటిష్ట భద్రత చర్యలు తీసుకున్నామని ప్రజల రాక పోకలు, ఇతర విషయాలపై నిరంతర నిఘా ఉంచామని ఎస్పీ మాధవ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో సుమారు 240 కిలోమీటర్ల ప్రాంతం కర్నాటక రాష్ట్ర సరిహద్దుగా ఉందని అన్నారు. 16 పోలీస్ స్టేషన్ల పరిధిలో 18 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు ఆదనంగా 5 మొబైల్ పార్టీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇందులో భాగంగా జిల్లా లోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ లను పరిశీలించి సూచనలు సలహాలు జారీ చేశామన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థికసాయం

నల్లచెరువు : మండల పరిధిలోని కే. పూల కుంట గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త జహీర్ బాషా ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కదిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జికందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు నల్లచెరువు తెలుగుదేశం పార్టీ యువనాయకుడు లక్ష్మీపతి నాయుడు,హిందూపూర్ పార్లమెంట్ అధికార ప్రతినిధి గంగాధర్ క్షతగాత్రుడికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ సాహెబ్, దేవళం వేణు, పి.ఇంతియాజ్, సురేష్, మాలిక్, మునాఫ్, ఇమామ్ కాసిం, షామీర్, బషీర్, సలీం, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకులోకి మురుగునీరు

నల్లచెరువు : మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీ వద్ద ఉన్న తాగునీటి ట్యాంక్‌లోకి మురుగునీరు చేరుతున్నాయని ఉపసర్పంచి జుబేదా కుమారుడు షరీఫ్ వాపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమస్యపై గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని విమర్శించారు. మురుగు, వర్షపు నీరు తాగునీటి పైపులలో చేరి గ్రామం మొత్తానికి చేరుతున్నాయని దీంతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సొంత నిధులతో గతంలో రెండు మూడు సార్లు ఇక్కడ శుభ్రం చేయించామన్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వేసవి ముగిసే వరకు మున్సిపాలిటీలో తాగునీరు సరఫరా

పుట్టపర్తి అర్బన్ : పుట్టపర్తి మున్సిపాలిటీ లోని 20 వార్డులలో వేసవికాలం ముగిసే వరకు తాగునీరు సరఫరా చేస్తామని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. పట్టణంలోని పెద్ద బజారులో తాగునీటి సరఫరా ట్యాంకరును మాజీ జెడ్పీటీసీ చెన్నకేశవులు ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆది మాట్లాడుతూ పట్టణంలో పలు చోట్ల తాగునీటి సమస్య ఉందని పలువురు తమ దష్టికి తెచ్చారన్నారు. దీంతో తన సొంత ఖర్చులతో ఉచితంగా మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు ఫిల్టర్ నీటిని అందించాలని నిర్ణయించుకొన్నామన్నారు. వేసవిలో ఎక్కడ నీటితో ఇబ్బందులు పడకూడదనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. అవసరమైతే అదనంగా మరో టాంకర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఎవరు నీరు కావాలని ఫోన్ చేస్తే వారికి నీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అమ్మినేని కేశవ నాయుడు, ఐటిడిపి నియోజకవర్గం అధ్యక్షులు జయప్రకాష్, బేకరీ నాయుడు, శామీర్, జావిద్, కోనంకి సూరి, లెక్కల లింగప్ప, ఆంజనేయులు, సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని అందజేస్తున్న నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న సత్యసాయి ట్రస్టీ రత్నాకర్

పర్తి సాయి సేవాసమితి సదన్ ప్రారంభం

రొద్దం. పర్తి సాయి సేవ సదన్ ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని పెనుగొండ పావగడ ప్రధాన రహదారిలో పెన్నా నది సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన పత్తి సాయి సేవా సమితి సదన్ నూతన భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సత్యసాయి ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ఈ సేవ కేంద్రాన్ని ఎంతో అద్భుతంగా నిర్మించారని అభినందించారు. దేశవ్యాప్తంగా 13లక్షల మంది నిస్వార్థంగా సేవచేస్తున్నారని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే శంకరనారాయణ, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, కెటి శ్రీధర్, వివిధ దేశాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వివిధ దేశాలకు చెందిన వారు దాదాపు 400మందికి నిత్యావరస సరుకులు అందించారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించండి

గాండ్లపెంట : పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మండల కేంద్రంలోని సచివాలయం ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు ఎం. అక్కులప్ప, నరసింహులు మాట్లాడుతూ ఏడాదికాలంగా వేతనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యను పలుసార్లు అధికారులకు దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల మండల తనిఖీకి వచ్చిన డిఎల్‌పిఒ వెంటనే వేతనాలు చెల్లించాలని కార్యదర్శిని ఆదేశించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు ఆంజనేయులు, కదిరప్ప, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

టిడిపిలోకి పలువురు చేరిక

రామగిరి : మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో టిడిపి నాయకులు పరిటాల శ్రీరామ్ సమక్షంలో పలువురు టిడిపిలో చేరారు. మండలంలోని తగరకుంట, కొత్తూరు గ్రామలకు చెందిన పలువురు వైసిపి నాయకులు కనగానపల్లి మండల తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. బసినేపల్లి కృష్ణారెడ్డి, శరత్ కుమార్ రెడ్డి, ఓబిరెడ్డి, వడ్డే ముత్యాలు, బోయ ఆంజనేయులు, దాసరి వెంకట్రాముడు, వెట్టి పెద్దన్న, కొత్తూరు సుబ్బిరెడ్డి తదితరులు టిడిపిలో చేరారు.

బంజారా నూతన కమిటీ ఏర్పాటు

నల్లమాడ : స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మండల స్థాయి బంజారా సేవా సంఘం మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల బంజారా సేవా సంఘం అధ్యక్షులుగా గోపాల్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా బాబ్జి నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాలాజీ నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అశోక్ నాయక్‌తో పాటు మరో 21 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి జిల్లా బంజారా సేవా సంఘం మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కాంతమ్మ బాయ్, యూత్ విభాగం అధ్యక్షులు రాజు నాయక్, ఉపాధ్యక్షులు రంగలాల్‌నాయక్, మండల నాయకులు తొలిసే నాయక్, కృష్ణ నాయక్, నాగేనాయక్, సేవే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దయ్యస్వామి ఉత్సవానికి ఆహ్వానం

బత్తలపల్లి : మండలంలోని కోడెకండ్ల గ్రామంలో జరగనున్న కోడేకండ్ల పెద్దయ్య స్వామి పెద్ద పరుష మహోత్సవానికి మంత్రి కె.వి ఉషాశ్రీ చరణ్‌ను ఆహ్వానం పంపారు. ఈ మేరకు ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్య ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో కురుబ సంఘం నాయకులు మంత్రిని బుధవారం కళ్యాణదుర్గంలోని ఆమె స్వగృహంలో కలిసి పరుషకు ఆహ్వానించారు. కోడేకండ్ల గ్రామంలో ఈనెల 6,7 తేదీల్లో జరిగే మహోత్సవానికి రావాల్సిందిగా వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోటి సూర్య ప్రకాష్ బాబుతో పాటు, బండి వీరనారప్ప, బ్యాళ్ల పెద్దయ్య, ఆర్వేటి సోమశేఖర్, బ్యాళ్ల వెంకటరాముడు, బ్యాళ్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం

బుక్కపట్నం : కార్యకర్తల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో సీనియర్ టిడిపి నాయకుడు రామ మోహన్ ఇల్లు ప్రమాదవశాస్తు కాలిపోవడంతో పల్లె వారింటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

5 నుంచి బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం

ధర్మవరం టౌన్ : ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఈనెల 5వతేదీ నుండి నెల రోజుల పాటు ఉచిత బాస్కెట్‌బాల్ వేసవి శిక్షణా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి, అసోషియేషన్ అధ్యక్షులు మేడాపురం రామిరెడ్డి, సెక్రటరీ హిదయతుల్లా తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

DHARMAVARAM MUNIICPALITY

Invitation for Expression of Interest for Quality Assurance and Technical Monitoring Consultants.

The Municipal Commissioner, Dharmavaram municipality invites Expressions of interested form interested reputed firms / organizations for quality assurance and technical monitoring of Municipal works.

Last date for receipt of application with qualified experience certificate details in the 0/o The Municipal Commissioner, Dharmavaram Municipality is before 5:00 PM on 10.05.2023.

Interested firms / Agency may apply with the qualified experience certificate details.

For further details, contact Municipal Engineer, Dharmavaram Municipality (Cell No. 9849906644, email ID: dharmavarammunicipalitvqmail.com

Sd/- Commissioner
Dharmavaram Municipality.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ఆసుపత్రిలో వైద్యసేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చునని కలెక్టర్ పి అరుణ్ బాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు పలు అంగన్వాడీలను బుధవారం తనిఖీ చేశారు. పిహెచ్‌సిలో వైద్యులు, సిబ్బంది వివరాలను సిహెచ్‌ఒ సుభాషిణిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవలు, మందుల వివరాలు, పరిశుభ్రతపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రులు పరిశుభ్రతకు చిరునామాగా నిలవాలని సూచించారు. వైద్యవృత్తి ఎంతో గౌరవప్రదమైనదని అన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ను సక్రమంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ సచివాలయం వారీగా జన సంఖ్యను పరిగణలోకి తీసుకునివయస్సు వారీగా వివిధ రకాల ఆరోగ్య సమస్యలను గుర్తించాలన్నారు. ఎఎన్ఎం, ఆశ, సిహెచ్‌ఒలతో ప్రతివారం సమావేశం ఏర్పాటు చేసుకొని ఆరోగ్య కేంద్రాల పరిధిలో చేపట్టాల్సిన చర్యలపై తగు సూచనలు చేయాలని చెప్పారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో మందులకొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మహమ్మదాబాద్ క్రాస్ లోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. సమయపాలన పాటించాలని అంగన్వాడి సూపర్వైజర్ జయమ్మకు సూచించారు. స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు, ఫుడ్ బ్యాలెన్స్ పరిశీలించారు. సచివాలయ స్థాయి నుండి మండల స్థాయి వరకు కుడా వైద్య సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ కృష్ణారెడ్డి, తహశీల్దార్ పి శ్రీధర్, ఇఒఆర్‌డి రాజశేఖర్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అడ్మిషన్లపై చర్యలకు డిమాండ్

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యాసంవత్సరం ప్రారంభం కాకమునుపే కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు అడ్మిషన్స్ నిర్వహిస్తున్నాయని ఆలాంటి విద్యాసంస్థలపై జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేశారు. అక్రమ అడ్మిషన్లపై బుధవారం ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడారు. 2023-24 విద్యాసంవత్సరం ప్రారంభం కాకుండానే జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలు విచ్చలవిడిగా అక్రమంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయన్నారు. విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. విద్యాశాఖ ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోకుండా విచ్చలవిడిగా అక్రమ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నారని, ఈ తంతు అంతా విద్యాశాఖ అధికారులకు తెలిసినప్పటికీ మామూళ్ల మత్తులో పట్టించుకోవటం లేదని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు అక్రమ అడ్మిషన్స్ నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని, దానికి పూర్తి భాధ్యత విద్యాశాఖ అధికారులే వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, బాబు, నవీన్, సురేష్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి

బత్తలపల్లి : వైసిపి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎపి కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలో నిర్వహించిన 'మా నమ్మకం నువ్వే జగన్' అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా సబ్ స్టేషన్ వెనుక,అనంత రూరల్ స్కూల్ ఏరియాలలో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కుమ్మర వెంకటరమణ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు, వైసిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : గత నాలుగేళ్ల కాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి రాబోయే 2024 ఎన్నికల్లో తిరిగి వైసిపికే పట్టం కట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ప్రజలను కోరారు. మండల పరిధిలోని ఆచార్యపాలెం గ్రామంలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ సంఘం చైర్‌పర్సన్ నళినిరంగే గౌడ్, ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ భూతరాజు, సింగల్ విండో అధ్యక్షులు చంద్రప్ప, వక్కలిగల సంఘం డైరెక్టర్ నాగప్ప. బీసీ సెల్ జిల్లా కార్యదర్శి శివకుమార్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు రమేష్, మాజీ సర్పంచి నాగరాజు గుప్తాతో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

బాగేపల్లి న్యూస్...

సిపిఎం అభ్యర్థికి వెల్లువెత్తుతున్న సహకారం

ప్రజాశక్తి- చిలమత్తూరు(బాగేపల్లి నుంచి)

సిపిఐ(ఎం) అభ్యర్థి డాక్టర్ అనీల్ కుమార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లిన సమయంలో ఆయా ప్రాంతాల వారి నుంచి పెద్దఎత్తున సహకారం అందుతోంది. ఈ సందర్భంగా చిన్నారులు, విద్యార్థులు, దివ్యాంగులు విరాళాలు ఇస్తూ సిపిఎం అభ్యర్థి గెలుపును కాంక్షిస్తున్నారు. కమ్యునిస్టు పార్టీ గెలిస్తేనే తమ బ్రతుకులు మారుతాయని వారు అంటున్నారు. బిళ్లూరు పంచాయతీ ఉగ్రార గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థిని తన చదువుల కోసం హుండిలో దాచుకున్న డబ్బుని విరాళంగా ఇచ్చింది. అదే విధంగా పాతపాలేం గ్రామానికి చెందిన దివ్యాంగుడు తన పించను సొమ్మును విరాళంగా అందజేశాడు. తమ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే పేదోడు ధైర్యంగా తిరగాలంటే సిపిఐ(ఎం) బాగేపల్లిలో రావాలని ఆ దివ్యాంగుడు అన్న మాటలు పలువురుని ఆలోచింప చేస్తున్నాయని సిపిఐ(ఎం) అభ్యర్థి డాక్టర్ అనీల్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు తమ పార్టీ పైన ఉన్న అభిమానం ఎన్నటికి చెరగనిదని అన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఐ(ఎం), జెడిఎస్, నాయకులు, కార్యకర్తలు, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పింఛను మొత్తాన్ని విరాళంగా అందజేస్తున్న వికలాంగుడు

దాచుకున్న హుండీ సొమ్మును అందజేస్తున్న విద్యార్థిని

కమనీయం... చెన్నకేశవుడి రథోత్సవం

చెన్నకేశవుడి రథోత్సవంతో పాల్గొన్న ప్రజలు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి రథోత్సవం కమనీయంగా సాగింది. పట్టుకేంద్రంలో రెండేళ్ల కరోనా అనంతరం బుధవారం నిర్వహించిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను తిలకించడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. 11రోజులుగా జరిగే ఈఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 7గంటలకు మడుగుతేరు, సాయంత్రం 4గంటలకు బ్రహ్మరథోత్సవం, 6గంటలకు ధూళోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ మడుగుతేరు (రథోత్సవం)కు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఆయన భార్య సుప్రియ, ఆలయ చైర్మన్ దాశెట్టిసుబ్రమణ్యం, ఈవో వెంకటేశ్వర్లు, తదితరులు హాజరై రథాన్ని లాగి ప్రారంభించారు. అంతకు మునుపు స్వామి వారిని పట్టణ ప్రముఖులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద నుండి చెన్నకేశవస్వామి, భూదేవి శ్రీదేవి ఉత్సవవిగ్రహాలను గజవాహనంపై రథం వద్దకు తీసుకువచ్చి అందులో ఉంచారు. అనంతరం వేలాది మంది భక్తులు రథోత్సవం వద్ద పూజలు నిర్వహించి ప్రసాదాలను అందుకున్నారు. సాయంత్రం 4గంటలకు బ్రహ్మరథోత్సవాన్ని లాగారు. ఈ బ్రహ్మోత్సవాన్ని తిలకించడానికి జిల్లా నలుమూలల నుండి భక్తులు తరలివచ్చారు. ఈ రథోత్సవంలో అన్నమయ్య సేవా మండలి అధ్యక్షుడు పొరాళ్లపుల్లయ్య శిష్యబృందం 50 మంది కళాకారులు సింగానిమేళం, పంచమవాయిద్యం, బంద నాట్యంతో భక్తులను అలరింపజేశారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం నిర్వహించిన రథోత్సవంలో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్‌లకు విడివిడిగా ఎన్టీఆర్ సర్కిల్ నుండి పూర్ణకుంభంతో మంగళవాయుధ్యాలు, డప్పువాయిద్యాల నడుమ స్వాగతం పలికారు. అక్కడ వారు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేకపూజలు చేయించారు. ఉత్సవాల సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.ఇన్‌ఛార్జి డీఎస్పీ హుస్సేన్ పీరా ఆధ్వర్యంలో సిఐలు సుబ్రహ్మణ్యం, రాజా, ఎస్ఐలు మహమ్మద్ రఫీ, ప్రదీప్ కుమార్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు..

పట్టువస్త్రాలను అర్చకులకు అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

కొనసాగిన సేవా కార్యక్రమాలు : పట్టణంలో బుధవారం లక్ష్మీచెన్నకేశవుడి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా పట్టణంలోని పలువురు భక్తులు బుధవారం సేవలందించారు. రథోత్సవంలో కొందరు తాగునీరు అందజేయగా మరికొందరు మజ్జిగ, అన్నప్రసాదాలు అందజేశారు. మాజీ ఎమ్మెల్యేగోనుగుంట్ల సూర్యనారాయణ ఆధ్వర్యంలో వాటర్ బాటిళ్లను పంపిణీచేశారు. 25వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జిభీమనేని ప్రసాదనాయుడు ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు, మజ్జిగను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ పంపిణీచేశారు. అదేవిధంగా తొగటవీర క్షత్రియులు, ఆదర్శసేవాసంఘం, వాసవీ హెల్పింగ్ హ్యాండ్స్, ఆర్యవైశ్య - యువజన సంఘం భక్తులకు అన్నప్రసాదాలు,మజ్జిగ, తాగునీటిని అందజేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టణంలో పలు దుకాణాలు వెలిశాయి. రథోత్సవానికి తరలివచ్చిన భక్తులను దష్టిలో ఉంచుకుని పిల్లల ఆటవస్తువులు, మహిళలకు గాజులు, ఇంటి అలంకారానికి ప్లాస్టిక్ -వస్తువులు, పుష్పాలు తదితర వస్తువులతో పాటు ప్రసాదాల దుకాణాలు వెలిశాయి.

వాటర్ బాటిళ్లను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

పంచ వాయుద్య బృంద నాట్యం చేస్తున్న అన్నమయ్యసేవా మండలి సభ్యులు